క్లుప్తంగా

ఘనంగా నాంచారమ్మ కొలుపులు



దమ్మనవారిపాలెం (కర్లపాలెం): గ్రామదేవత నాంచారమ్మ కొలుపులు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి వార్షిక కొలుపులు ఈ నెల 21 నుంచి ఐదు రోజుల పాటు గ్రామంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు, వీరతాళ్లకు మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కొలుపుల ముగింపులో భాగంగా భక్తులు ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి, పొంగళ్లు పొంగించి, మొక్కులు సమర్పించుకున్నారు.

ప్రజలకు సేవలందిస్తాం..



బాపట్ల: ఆవుల సంక్షేమ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సంస్థ పలు సేవా కార్యక్రమాలను ప్రకటించింది. ఆర్మీ నుంచి రిటైర్డ్ అయిన తర్వాత సమాజానికి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సంస్థను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల మహేష్, పి.బలరామకృష్ణ, గిరిజారాణి, రోజన్‌బాబు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

బూత్ స్థాయి శిక్షణకు బీజేపీ నాయకులు



బాపట్ల: బీజేపీ ఆధ్వర్యంలో జరిగే బూత్ స్థాయి సమావేశానికి బాపట్ల నుంచి ఒక ప్రత్యేక బృందం బయలుదేరి వెళ్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎల్ మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు భోపాల్‌లో జరిగే శిక్షణకు ఆదివారం వెళ్తామని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. శిక్షణ సమావేశానికి వెళ్లిన వారిలో అడపాల కృష్ణ, ఎం.కృష్ణప్రసాద్, అద్దేపల్లి రాఘవులు పాల్గొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం కిటకిటలాడింది.


జగనన్న సురక్ష సర్వే పరిశీలన

పిట్టలవానిపాలెం: సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అన్నారు. పిట్టలవానిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను ఆమె ఈఓపీఆర్డీ కె.పద్మజతో కలిసి ఆదివారం పరిశీలించారు. ప్రజలకు కావలసిన 11రకాల పత్రాలు, సర్టిఫికెట్‌లు, ప్రభుత్వ పథకాల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. మండలంలో రెండు బృందాలు క్యాంపులు నిర్వహించి తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి యేట్ర అంకమ్మరెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు రూ.6వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవలఅంకమ్మ రెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. గుంటూరు ప్రవేట్ వైద్యశాలలో శస్త్ర చికిత్స నిమిత్తం.. పరిశ నరసింహారెడ్డి తోటి ఉపాధ్యాయులు విద్యార్థిని పరామర్శించి, నగదు అందజేశారు.

పొగ ముప్పు.. కలగదా కనువిప్పు



బాపట్ల అర్బన్: మూలపాలెం పంచాయతీలో ప్రజల ఆరోగ్యానికి పొగ పెడుతున్నారు. ఊరి మధ్యలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంతో.. అక్కడే వ్యర్థాలను దహనం చేస్తున్నారు. అటు వైపు వెళ్లే ప్రజలు ఆ పొగ పీల్చక తప్పడం లేదు. పంచాయతీ సిబ్బంది వేళాపాళా లేకుండా ఇష్టమొచ్చినట్లు వ్యర్థాలను దహనం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

కార్పొరేటు..సప‘రేటు’

- పుస్తకాల నుంచి యూనిఫాం వరకు ప్రతీదానికి ఒక రేటు..
- స్కూల్స్‌లోనే దుకాణాలు తెరిచి విక్రయిస్తున్న యాజమాన్యాలు
- వారి వద్దే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు ఆదేశాలు
- ఇక ఫీజులు చూస్తే.. ఫ్యూజులు ఎగిరిపోవాల్సిందే
- పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని మిన్నకుండిపోతున్న తల్లిదండ్రులు



బాపట్ల పట్టణంలోని ఓ కార్పొరేట్ స్కూల్లో పాఠ్య పుస్తకాలు



విద్యార్థులే మోసుకుంటూ పుస్తకాలను తీసుకెళ్తున్న వైనం..

బాపట్ల అర్బన్: రంగుల రంగుల ఖరీదైన భవనాలు.. ‘వెల్ కమ్ సార్’అంటూ ఇంగ్లిష్ ముక్కల స్వాగతాలతో తల్లిదండ్రుల కళ్లకు కార్పొరేటు స్కూల్స్ గంతలు కడుతున్నాయి. ఇదిగో మీ పిల్లలకు ఇక ర్యాంకుల పంటేనంటూ భవిష్యత్‌ను కళ్ల ముందు చూపిస్తున్నాయి యాజమాన్యాలు. ఒక్కసారి అడ్మిషన్ తీసుకుంటే విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెట్టేస్తున్నాయి. పుస్తకాలకు, యూనిఫాం, టై, బెల్టు ఇలా ప్రతీదానికి ఒక రేటు కట్టి వ్యాపారం చేస్తున్నాయి. తమ పిల్లలపై తల్లిదండ్రుల పెట్టుకున్న ఆకాంక్షలను కాసుల రూపంలో మార్చుకుంటున్నాయి.

బాపట్ల జిల్లాలో మొత్తం 299 ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 66,223 మంది విద్యార్థులు చదువుతున్నారు. వేసవిలో యజమాన్యాలు టీచర్లను అడిషన్ల టార్గెట్లు ఇచ్చి, ఇంటింటికీ తిప్పించాయి. ఆయా టీచర్లు తమ నైపుణ్యంతో ముఖ్యంగా మధ్యతరగతి తల్లిదండ్రులను ఎలాగోలా ఒప్పించి, అడ్మిషన్లు తీసుకొన్నారు.

అడ్మిషన్ ఫీజు నుంచి అంతా బాదుడే

విద్యార్థులకు అడ్మిషన్ రాయించనప్పటి నుంచి ఇక ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు దోపిడీకి తెరతీస్తున్నాయి. పిల్లలకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అంతా తమ స్కూల్లోనే కొనుగోలు చేయాలని రూల్స్ పెడుతున్నాయి. నర్సరీ విద్యార్థికి కనీసం రూ.6వేల నుంచి రూ.10 వేల వరకు పుస్తకాల ఫీజుల రూపం వసూలు చేస్తున్నాయి. ఏబీసీడీలు నేర్చుకునే పిల్లలకు ఇన్ని పుస్తకాలు ఏంటని కొందరు తల్లిదండ్రులు నెరెళ్ల బెడుతున్నారు. ఇక స్కూల్‌లో చేర్చాక తప్పేదేముందిలే అని అప్పోసొప్పో చేసి, పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు టై, బెల్ట్, యూనిఫాం అన్నీ అదే స్కూల్‌లో కొనుగోలు చేయాల్సిందే. ఒక్క మాటలో చెప్పాలంటే.. పాఠశాలను విక్రయశాలగా మార్చి, తల్లిదండ్రులను దోచుకుంటున్నారు.

ఫీజులు చూస్తే ఫ్యూజులు ఎగిరిపోవాల్సిందే..

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు చూస్తే ప్రతి ఒక్కరికీ ఫ్యూజులు ఎగిరిపోతున్నాయి. ఎల్‌కేజీ విద్యార్థులకే ఏడాదికి రూ.20 వేల నుంచి రూ.40 వేలు వసూలు చేస్తున్నారు. ఇక పదో తరగతి విద్యార్థులకు కొన్ని పాఠశాలలు రూ.లక్ష వరకు దండుకుంటున్నాయి. పిల్లల భవిష్యత్ బాగుండాలనే తపనతో తల్లిదండ్రులు అప్పులపాలై విద్యార్థులను చదివిస్తున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు, వసతులు, సేఫ్టీ వంటి అంశాలపై ఎప్పటికప్పుడు విద్యా శాఖాధికారులు తనిఖీ చేయాలి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఆయా విద్యా సంస్థలను సీజ్ చేయాలి. అదే సమయంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను బోర్డులో ఉంచాలి. కానీ ఎక్కడా ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. వీటి గురించి విద్యా శాఖాధికారులు పట్టించుకున్న ఆనవాళ్లు కనిపించవు. విద్యా శాఖాధికారులు ప్రైవేటు విద్యా సంస్థల్లో దోపిడీ గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రైవేటు, కార్పొరేటు దోపిడీకి కళ్లెం వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం, స్టేషనరీ తప్పనిసరిగా తీసుకోవాలనే నిబంధన లేదు. అలాగే కొన్ని పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే ఎంఈఓలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశాం. నేటి నుంచి ప్రతి స్కూల్లో తనిఖీలు చేస్తాం. అధిక ఫీజులు వసూలు చేసినా, మెటీరియల్స్ విక్రయించినా తల్లిదండ్రులు మా దృష్టికి తీసుకురావాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

– పీవీజే రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల.

పేద కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- పెదపాలెంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



పెదపాలెంలో మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి నాగార్జున

పెదపాలెం(భట్టిప్రోలు): రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటూ.. న్యాయం చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని పెదపాలెంలో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి.. వివిధ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులు, ప్రజా ప్రతినిధులు అర్హులకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వ పాలన సాగుతోందని, సీఎం వైఎస్‌జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని మంత్రి నాగార్జున అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రూ.3.50 లక్షల వ్యయంతో తాగునీటి పైప్ లైన్ల ఏర్పాటుకు శిలా ఫలకాన్ని మంత్రి నాగార్జున ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు నీలా రమేష్, పులివర్తి సుధాకర్, దావూరి నాగమల్లేశ్వరరావు, నీలా నాగరాజు, తిరివీధుల బాలాజీ, భట్టిప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, వీఆర్వో వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ విజయసారథి



రేపల్లె రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్‌లను ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ విజయసారథి చెప్పారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనన, మరణ, కుల ధృవీకరణ, సీసీఆర్సీ, రేషన్‌కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఆదాయం తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలు సర్వీస్ చార్జ్ లేకుండా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆధార్ కార్డుకు ఫోన్ నంబరును అనుసంధానం చేసుకునేందుకు, అప్‌డేట్ చేసుకునేందుకు ఉపకరిస్తుందని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గృహాలకు వచ్చిన ప్పుడు కావాల్సిన సర్టిఫికెట్‌ను తెలియజేయాలన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మణిలాల్



మాట్లాడుతున్న సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: ఆశ వర్కర్‌ల సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మణిలాల్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆశ వర్కర్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పెరిగిన జనాభా ప్రకారం ఆశ వర్కర్స్‌ని పెంచాలన్నారు. ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ప్రతిరోజూ ఆశావర్కర్ జనరల్ ఓపీ ఐదుగురిని తీసుకురావాల్సిందే అన్న నిబంధనతో ఆశ వర్కర్స్ గర్భిణులకు అందించే సేవలు, విధులకు ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. ఆశ వర్కర్స్‌తో సంబంధం లేని పనులు చేయంచరాదని, ఓల్డ్ టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో వస్తున్న స్థానిక సమస్యలు పరిష్కారించి, పనిఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ పావని, బుజ్జి, ఎస్తేర్ రాణి, మహాలక్ష్మి, జ్యోతి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునపై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు



పెదపులివర్రులో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వంపై అసత్యపు ఆరోపణలు చేస్తూ, మంత్రి మేరుగ నాగార్జున పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మంత్రి నాగార్జునను ఉద్దేశించి బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసరడంతో వైఎస్సార్ సీపీ నాయకులు స్పందించారు. భట్టిప్రోలులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నోమార్లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సాయిబాబా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సాయిబాబా భార్య లక్ష్మీ పార్వతి సర్పంచ్‌గా ఉన్నప్పుడు వచ్చిన అవినీతి ఆరోపణలపై డీపీవో కార్యాలయానికి వెళ్లి రూ.1.50 లక్షలు చెల్లించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని భట్టిప్రోలు గ్రామాన్ని భ్రష్టు పట్టించిన బిల్లప్ బాబాకు.. మంత్రి నాగార్జునను విమర్శించే అర్హత లేదని స్పష్టం చేశారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ద్వారా ఆయన లబ్ధి పొందిన మాట నిజం కాదా అన్నారు. సాయిబాబా ఇకనైనా నోరు అదుపులోకి పెట్టుకోవాలని హెచ్చరించారు. అధికారంలో ఉండి దళిత సర్పంచ్‌ను అవమాన పరచి వారిని క్షోభకు గురి చేసిన దళిత ద్రోహి సాయిబాబా అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మోర్ల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి శ్రీను బాబు, సుభాని బేగ్, సయ్యద్ ఇస్మాయల్, తదితరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు చేస్తున్న సాయిబాబా

శవరాజకీయాలు చేస్తున్న సాయిబాబా నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. పెదపులివర్రులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మంత్రి నాగార్జునపై విమర్శలను ఖండించారు. సమావేశంలో నీలా నాగరాజు, గద్దె కిషోర్, దాసరి ఏసుపాదం, బేతాల సురేష్, నీలా రమేష్, పున్నారావు, నీలా రాంబాబు, మేడికొండ నాగేంద్ర, జి.హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు నిజాంపట్నంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

నిజాంపట్నం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 1 గంట నుంచి నిజాంపట్నం గ్రామంలో జరుగుతుందని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు తెలిపారు. ఆదివారం నిజాంపట్నంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు నిజాంపట్నం గురుకుల పాఠశాల నుంచి తోటలబారు, హరిజనవాడ, మిరియాలవారిపాలెం, ఐస్‌ఫ్యాక్టరీ, చింతరేవు రోడ్డు, శివాలయం, నాయీ బ్రాహ్మణ కాలనీ, ఏకలవ్య నగర్, లైయన్స్ క్లబ్ సెంటర్ ఏరియాలో ఇంటింటికీ తిరుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ కన్వినర్లు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని ఇసుకపల్లి, గరువురోడ్డు, ఉప్పూడి రోడ్డు, నిజాంపట్నం రోడ్డులోని అయోవా స్కూల్ పరిసరాలు, జగనన్న కాలనీ, అరుంధతీ నగర్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న బాపట్ల డీఆర్వో శివజ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు

తెనాలిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి గొప్పగా ఎదగాలని బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతి కోరారు. ముత్తైంశెట్టి పాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతిలతో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రశంసా పత్రాలు అందజేశారు. సభకు ట్రస్ట్ చైర్మన్ ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్షత వహించారు. సభలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాసులు(విజయవాడ) మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో విద్యను అభ్యసించి స్వయం కృషితో ఎదగాలని తెలిపారు. విశ్రాంత అధ్యాపకులు జొన్నాదుల నరసింహారావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ట్రస్ట్ చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ఆరు మున్సిపల్ పాఠశాలలో గతేడాది పదోవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు తెలిపారు. ట్రస్ట్ ద్వారా 120మందికి నోట్ బుక్స్, స్టేషనరీ, దుస్తులు ముఖ్య అతిథులు అందజేశారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన డాక్టర్ జాస్తి వెంకట సుబ్బారావు దంపతులు, సాధనాల కేశవరావు, కోన వెంకట నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పావని ప్రియాంక, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సాంబ్రాజ్యలక్ష్మి, సినీ గేయ రచయిత వీరేంద్ర ప్రసాద్, ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, వెంకట శివశంకర్, రమాదేవి, భానుమతి, కొమ్మూరి మోహనరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజాంపట్నం: గరుదుపాలెం గ్రామంలో బీజేపీ జిల్లా మాజీ యువమోర్చా కార్యదర్శి బండారు ఫణి కుమార్ 7వ వర్ధంతిని పురస్కరించుకుని మిత్రబృందం, సేవా భారతి ఆధ్వర్యంలో 2వ రోజు ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగ్గన గణేష్‌బాబు మాట్లాడుతూ ఏటా ఫణికుమార్ వర్ధంతి రోజున ఇలాంటి వైద్యసేవలను అందించడం హర్షణీయమన్నారు. డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ జిష్ణు మోహెద్, డాక్టర్ భానుచందర్ ప్రసాద్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండారు రమేష్ , రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ ఇంకొల్లు మాణిక్యారావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలి

పట్టణ సీఐ నజీర్‌బేగ్



రేపల్లె: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలని పట్టణ సీఐ ఎం.నజీర్‌బేగ్ సూచించారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆదివాయం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, మాట్లాడారు. గొడవలు, సెటిల్‌మెంట్‌లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. రౌడీషీటర్ల కదలికపై నిరంతరం నిఘా ఉంచామని, నేరాలకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. సమావేశంలో ఎస్ఐ అబ్దుల్ రజాక్, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- నేరప్రవృత్తి విడనాడకపోతే చర్యలు తప్పవు
- జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు

బాపట్లటౌన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఒకసారి నేరం చేసిన వ్యక్తి.. మళ్లీ నేరం చేయాలనే ఆలోచన చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరస్థులు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల ముందస్తు పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. ఈ కౌన్సెలింగ్ లో గతంలో నేరాలు చేసి ప్రస్తుతం రౌడీ షీటర్ గా ఉన్న వారి రోజువారీ జీవితం ఎలా గడుపుతున్నారు? గొడవలకు, నేరాలకు, అల్లర్లు సృష్టించుటకు దూరంగా ఉన్నారా? లేదా? ఇలాంటి విషయాలు తెలుసుకున్నామన్నారు. మాజీ నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూనే పోలీస్ శాఖ నిఘా ఉంటుందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతను అదుపులో ఉంచి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యల‘ఫ్లై ఓవర్’



జమ్ములపాలెం బ్రిడ్జిపై తగలపడుతున్న వరిగడ్డి ట్రక్కు(ఫైల్)

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. బ్రిడ్జి నిర్మాణంలో గత పాలకులు చేసిన తప్పులకు నేడు ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారు. జమ్ములపాలెం రోడ్డులోని ఈ బ్రిడ్జికి దిగువవైపున రెండు వైపులా ఆక్రమణల పరం పర కొనసాగింది. ఆక్రమణలకు తోడు విద్యుత్ లైన్లు కూడా రోడ్డు పక్కన వదిలివేయటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బ్రిడ్జికి అనుకుని చిన్న కొట్టులు పెట్టడం వల్ల ఈ ప్రాంతంలో వచ్చే వాహనాదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ట్రాక్టర్లలో తీసుకొస్తున్న వరిగడ్డి విద్యుత్‌లైన్లు తగిలి మంటలు అంటుకున్నాయి. దీంతో ట్రక్కుతో సహా వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. బ్రిడ్జి దగ్గర మెడికల్ కళాశాల పనులు వేగంగా సాగుతున్నాయి. ఇక్కడ ఉన్న కొట్టులు అడ్డుగా ఉండటంతో మలు పుతిరిగే సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైన బ్రిడ్జి వద్ద ఆక్రమణలు తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి మచిలీపట్నం-రేపల్లె బస్ సర్వీస్

మచిలీపట్నం టౌన్: ప్రయాణికుల కోరిక మేర కు మచిలీపట్నం నుంచి రేపల్లెకు పల్లె వెలుగు బస్సు సర్వీసును సోమవారం నుంచి పునరుద్ధరించామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు మచిలీపట్నం డిపో నుంచి ప్రతి రోజూ ఉదయం 7.10 గంటలకు, 11.10 గంటలకు, సాయంత్రం 5.10 గంటలకు బయలు దేరుతుందన్నారు. అలాగే రేపల్లె నుంచి ఉదయం 9.15 గంటలకు, మధ్యాహ్నం 1.10 గంటలకు, ఐదు గంటలకు పల్లె వెలుగు సర్వీసు మచిలీపట్నంకు బయలు దేరుతుందని వివరించారు. మచిలీపట్నం, రేపల్లె ప్రాంతాల ప్రయాణికులు వినియోగించు కోవాలని కోరారు.

‘మాతృశ్రీ’కళాశాల కరస్పాండెంట్‌గా గోగినేని

బాపట్ల అర్బన్: జిల్లెళ్ల మూడిలోని మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల కరస్పాండెంట్‌గా విద్యావేత్త, కళాశాల పూర్వ విద్యార్థి సమితి అధ్యక్షుడు గోగినేని రాఘవేంద్రరావు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీ విశ్వ జనని పరిషత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ గిరిధర కుమార్, కళాశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్, ఆంధ్రా బ్యాంకు విశ్రాంత జీఎం బొప్పూడి రామబ్రహ్మం సమక్షంలో రాఘవేంద్రరావుకు నియామకపత్రం అందజేశారు. రాఘవేంద్రరావు గత నాలుగు దశాబ్దాలుగా భట్టిప్రోలు మండలం పెద్దలంకలో స్వాతి విద్యా సంస్థలు విజయవంతంగా నడుపుతున్నారు. ఐదు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాలకు సంస్కృత పండితులను, తెలుగు ఉపన్యాసకులను అందిస్తున్నారు. కళాశాలను అన్నివిధాలుగా తీర్చిదిద్దుతానని రాఘవేంద్రరావు అన్నారు. అంతర్జాతీయ జానపద గాయకుడు, పూర్వ విద్యార్థి దామోదర గణపతిరావు, రచయిత డాక్టర్ జయంతి చక్రవర్తి, పూర్వ విద్యార్థి సమితి కోశాధికారి పొనుగుపాటి సత్యనారాయణరావు, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ సత్రీ, పాల్గొన్నారు.